# Episode-48

## పరిశుభ్రతే దైవత్వం

పైడి ముక్కల ఆనంద్ కుమార్

( ట్రాఫిక్ రణ గొణ ధ్వనులు, హారన్లు నిర్విరామంగా మోగుతున్నాయి. గొడవ గొడవ గా వుంది )

డ్రైవర్ ఛీఛీ .......ఏం సిటీనో ఏమో.....ఈ సిటీ లో టాక్సీ నడపడమంత దౌర్భాగ్యం ఇంకొకటి లేదు. ఈ ట్రాఫిక్ ఎప్పుడు క్లియరవుతుంది? కడుపుతో వున్న అమ్మాయిని హాస్పిటల్ కి తీసుకెళ్ళాల్సి వస్తే టాక్సీ లోనే నీళ్లాడుతుంది. అట్లున్నది నా బతుకు....

పాసింజరు 1 అసలేం జరుగుతున్నదయ్యా. ఇప్పటికే పదినిమిషాలైంది. ఇంతవరకు ఒక మిల్లీ మీటరు కూడా మన టాక్సీ ముందుకు జరుగలే. నీ డ్రైవింగ్ యిట్లుంటే యింక బాగనే.

పాసింజర్ 2 ఏమయ్యా డ్రైవరూ.... జర కిందికి దిగి ఏం కొంప అంటుకుందో చూడ్నీకి పోయి వస్త ! ఏమంటవు

డ్రైవర్ మీరెందుకు సార్ దిగడం. నేనే చూసి వస్తా !

పాసింజర్ 2 అరె ! ఒకేళ పచ్చ దీపం ఎలిగిందనుకో, నువ్వు ముందుకు జరగనీకి వీలుంటది. ఎట్లయినగని ఈ ట్రాఫిక్ లో ఝుమ్మని ముందుకు పోలేవు. జర నేను చూసి వస్త ఆగు.
( డోర్ తెరచి మూసిన చప్పుడు. డోర్ తీయగానే రణగొణ ధ్వని తీవ్ర తరమైంది. డోర్ మూస్తే రణగొణ ధ్వని తగ్గింది )

పాసింజరు 1 పొద్దున్నే లేచి ఎవడి మొహం చూసినో ఏందో, బయల్దేరిన మూర్తం ఏందో....యాష్ట కొస్తున్నది.

డ్రైవర్ మీరు ఎవరి మొహం చూసినా రోజూ యిదే భాగోతం నడుస్తది. ఏ మూర్తంలో బయటికెళ్ళిన గింతే వుంటది. మొహాలు చూసి, మూర్తాలు పెట్టుకుని బయటికెళ్ళే కాలాలు ఎప్పుడో పొయ్యినై. రానురాను సింగపూర్ ఆయితదనుకుంటున్న సిటి నరకంగా తయారైంది. పొద్దున్నే అయిదింటికి అచ్చిన. అప్పటికెళ్లి యిప్పటి దాక సరిగ్గ గిరాకి కాకనే పాయె.ఛీ....యవ్వ.....
(డోర్ తెరచి మూసిన చప్పుడు. మళ్ళీ రణ గొణ ధ్వని....సర్దుకున్నది )

పాసింజర్ 2 గీ పక్కన కాలనీలో ఖాళీగా వున్న జాగల మున్సిపాలోళ్ళు చెత్త

| | |
|---|---|
| | తీస్కచ్చి నింపుతున్నరట. కాలనీల వుండేటోళ్ళు రోడ్లు బ్లాక్ జేసి ధర్నజేత్తున్నరు. |
| పాసింజరు 1 | దేశమా ! ఏం జేయ ? |
| డ్రైవర్ | చేసెటందుకేమున్నది ? నేనైతే యిట్లనే కూసొని కనపడని దేవుడికి దండం బెడత. దండం బెట్టిన సుత ఆయన జేసే దేం లేదు. మనం జేసేదేం లేదు. ఏదో ఒకటి జేయ్యాల్సిన అధికారులు మాత్రం ఏం జేయరు. |
| పాసింజరు 1 | దేశమా.... |
| పాసింజరు 2 | అరె నీ....దేశమంటే మనమే నయ్య. ఊకే దేశమనకు. |
| పాసింజరు 1 | అరె....మా అమ్మకు బాగ లేదని ఫోనొచ్చింది. యిప్పుడామెతానకు పొయ్యి ఆమెను దీసుకుని హాస్పిటలకు పోవాలె. పోయేదాక మా అమ్మ వుంటదో.....వూడ్తదో..... |
| పాసింజరు 2 | అరెరె....ఎంత కష్ట మొచ్చిందయ్యా, దేశమా..... |
| డ్రైవర్ | అరె ఊర్కోండి సాబ్... ఆయన పరేశాన్ ల వున్నాడు పాపం. దేశం యాది జెయ్యకండి.. |
| పాసింజరు 1 | పోలీస్ ఏం జేస్తుంది సార్. |
| పాసింజరు 2 | నన్నే నా నువ్వడిగేది. |
| పాసింజరు 1 | మీరే గద ఆడదాక పోయింది. |
| పాసింజరు 2 | అరే....ఏం జేత్తం బై....ఉన్న ఒక్క పోలీసోడు కంట్రోల రూం కి జెప్పి ఉంటాడు. ఫోర్సు రావాలె. వాళ్ళను లేపాలె. మరి గాడ కూకున్న వాళ్ళల్లో ఎవడైనా పొలిటీషియన్ వుంటే వాళ్ళు కాసేపు పిసక్క జత్తరు. యిప్పటిప్పట్ల ఈ ట్రాఫిక్ క్లియరయ్యేట్లు కనపడ్తలే |
| డ్రైవర్ | పాపం, గా కాలనీ వాళ్లకు యిళ్ళళ్ళంత కంపు వాసనొచ్చి జత్తున్నారు గావచ్చు. ఏందో సార్ దేశంల....... |
| పాసింజరు 1 | ఆగిపోయిన వేంది. దేశంల....... |
| డ్రైవర్ | చెత్త పెరుగుతున్నది సార్. |
| పాసింజరు 2 | గందుకే గద. స్వచ్ఛ భారత్ అంటుండ్రు |
| పాసింజరు 1 | ఏందో ఏమో. ఈ చెత్త ధర్నా....కాదు కాదు....చెత్త మీద ధర్నా..... ఉహూ...కాదు...చెత్తకు ఖిలాఫ్ గ....... |
| పాసింజరు 2 | అంటే వ్యతిరేకంగా |
| పాసింజరు 1 | ఆ గధ్ధదీ.....చెత్తకు ఎతిరేకంగా ధర్నా ఎప్పుడు ఆగుతదో.....మన మెప్పుడు కదుల్తమో..... |
| డ్రైవర్ | ఏద్దైన గట్టిగ పబ్లిక్ జెప్పిన ఎవరు పట్టించుకుంట లేరు సార్. |

| | |
|---|---|
| | గందుకే ధర్నాలు ఔతున్నయి. |
| పాసింజరు 1 | ఔర బై ! నిజం చెప్పినావు. అధ్గో....పోలీసు దిగింది....యింగా ట్రాఫిక్ మూవ్ మెంట్ తీస్కుంటది గావచ్చు. |
| పాసింజరు 2 | డ్రైవర్ తమ్మి ! రాన్రాను మన లైఫే ధర్న లైఫ్ అయ్యేట్లున్నది. |
| డ్రైవర్ | ఏమో సార్....మా లాంటోళ్ళకే సావు. ధర్న అయిన, బంద్ అయిన, ఏం జరిగిన ఆకాశం మా మీనే కూల్తది. |
| పాసింజర్ 1 | అగ్గో......ట్రాఫిక్ కదిలింది.....పోనియ్.....పోనియ్....( హారన్లు.... రణగొణ ధ్వని ) |

Interlude ( రాత్రి సమయం – కీచు రాళ్ళ శబ్దం )

| | |
|---|---|
| ఆంజనేయులు | ఈ రోజు మనం చేసిన ధర్నా మూలాన ఏమైనా ఉపయోగం వుంటుందా ? |
| కిట్టన్న | ఆంజనేయులూ ! |
| ఆంజనేయులు | ఏందిరో, పేరు బెట్టి పిలుత్తన్నవ్. పోరగాళ్ళకు మరేద లేకుండా పోతున్నది |
| సుర్మ | కిట్టన్న మాటలు పట్టించుకోకే అంజన్నా,,,,,, |
| ఆంజనేయులు | ఏందిరో కళ్ళకు సుర్మ పెట్టుకుని తిరిగి తిరిగి సుర్మ గాడని పెరుతెచ్చుకున్నావ్.....హనుమంతుడి మీద భక్తితో మా అమ్మ నాకు ఆంజనేయులు అని పేరు పెట్టింది. పేరు పెట్టి పిల్వనికి వాడేమైన రాముడా ?గిప్పుడు నువ్వు పిల్చినవు జూడు 'అంజన్నా' అని అది తీరుగ వున్నది. వీడికి కిట్టి గాడికి పెద్దంతరం మద్దెంతరం లేకపాయె. |
| సుర్మ | ఇంగ ఊకోవే....ధర్న జేయబట్టి ఏమైనా ఫాయిదా ఉంటుందా అని అడిగితివి. మల్ల నా పేరు మీద కెళ్లి లొల్లి బెడ్తంటివి ? జర ధర్న గురించి మాట్లాడరాదు. |
| ఆంజనేయులు | అరె కిట్టిగా...గా పేపరోళ్ళు ఈ ధర్నా గురించి రేపు పేపర్ల రాత్తమన్నారు......లేదా.... |
| కిట్టి | పేపర్లన్నీ ఒక్క పెద్ద మనిషి చేతుల్నే వుండే. ఆయన జెప్పితే రాత్తరు.....లేకుంటే రాయరు. |
| సుర్మ | కిట్టన్న...... పేపరోళ్ళతో శాన సేపు ముచ్చట బెడితివి గాదురా....మన ధర్న మీద ఒక ఫుల్ పేజి కవరేజి యియ్యమనక పోయినవు. |
| కిట్టన్న | ఏం కవరేజో ఏందో....యియ్యాల్రేపు శాన విషయాలు అవుటాఫ్ కవరేజి ఏరియాలోనే వున్నాయి. |

సుర్మ అరె....మనం యింత కట్టపడి ధర్న జేత్తే అది సుత అవుటాఫ్ కవరేజ్ ఏరియా అంటే యింగెట్లరా ?

కిట్టన్న నేను వాళ్లకు జెప్పిన్నే......ఇంకో విషయం కూడా జెప్పిన. మా తాత 50 ఏళ్ల కింద మున్సిపాలిటిలో పని జేసెటోడు. అప్పుడు అంబర్ పేట లో మున్సిపాల్టి కింద ఓ పదెకరాల భూమి వుండే.

ఆంజనేయులు మన హైద్రాబాదు లోనే......

కిట్టన్న అరె......మన హైద్రాబాద్ ముచ్చటే జెప్తున్న. అప్పుడింత ప్లాస్టిక్ బ్యాగులు లేకుండె. అంబర్ పేటలో గా భూమిల మున్సిపాలిటోళ్ళు 10 అడుగుల పొడవు 4 అడుగుల వెడల్పు 6 అడుగుల లోతుల గొయ్యిలు తీస్తుండిరి. మున్సిపాల్టీ సఫాయోళ్ళు జమ చేసుకొచ్చిన చెత్త నంత బండ్లల్ల దెచ్చి ఆ గొయ్యిలు నింపుతుండిరి. గొయ్యి పక్కన బోర్డు పెట్టి బొంద నిండిన దినం దాని మీన తారీఖు నోట్ జేస్తుండిరి. యింగా నాలుగైదు నెలలకు తరాజు ఏస్తుండిరి. రైతులొచ్చి ఆ తారీఖు బట్టి పాట పాడుతుండిరి. ఏలం పాటలో కొనుక్కొంగనే ఆ గొయ్యి తవ్వి మొత్తం బండ్ల పోసుకుని తమ పొలాలకు ఎరువు కింద పట్క పోతుండిరి.

ఆంజనేయులు దాన్నే కంపోస్టు ఎరువు అంటర్ర కిట్టిగా !

సుర్మ ఔ ! గప్పుడు ఈ కంపోస్టు బొందలను తవ్వేటందుకు సెంట్రల్ గవర్నమెంటు సబ్సిడిలు సుత యిచ్చెటిది.

కిట్టన్న అప్పటి కాలంల ప్లాస్టిక్ లేదు. కావల్సినంత భూమి వుండే, గిప్పుడేమో ప్లాస్టిక్ జెయ్య బట్టి కంపోస్టు బొందలు లేకపాయె.

ఆంజనేయులు మరిప్పుడేం జేద్దం ర....ఒక రోజంతా రాస్తా రోకో జేద్దమా ? ఈగీ చెత్త నంత తీసుకొచ్చి మన పక్కన ఖాళి భూమిల పడేసి మున్సిపల్ కార్పొరేషనోళ్ళు మనల పరేశాన్ జేస్తున్నారు. దోమలు పెరిగి, అంటు వ్యాధులొచ్చి.... ఇళ్ళన్ని కంపు కొట్ట బట్టె.

సుర్మ మనం ధర్న జేసినా మంచె పన్లేక జేసినమ ? మన తబీయత్ ఖరాబైతుంటే చూస్కుంట కూర్చుంటమ ?

కిట్టన్న చాల్ తీ ! నీ ఆరోగ్యం ఎవడి క్కావాలే. మనం ఎట్లా బోతె ఎవరికేంది ?

సుర్మ అరె...ఆరోగ్యం బాగుంటనే గదనే మనం నాలుగు పైసలు సంపాయించుకుంటం. మన సుట్టు సుబ్రంగ వుంటే ఆరోగ్యం

బాగుంటది.

ఆంజనేయులు అసలు మనోల్లకే సుబ్రం అంటే తెల్వది. ఇల్లంతా ఊడ్చి చెత్త చెదారమంత మన ఇళ్ళ బైటనే పోస్తరు. రైలెక్కితే పల్లి పొట్టంత తమ సీట్ల పక్కనే పోస్తారు. మనం ఎట్లా బాగు పడ్తమో ఏందో....

కిట్టన్న అరె...మున్సిపాల్టోళ్ళ సంగతి జూడ మంటే మన యింటి బాగోతం చెప్తంటివి . ముందు దీని సంగతి జూస్తె తర్వాత మన యిళ్ళల్ల సంగతి జూద్దం.

సుర్మ అసలు చెత్త గురించి ధర్న జేసినోళ్ళం ఓల్ ఇండియాల మనదే రికార్డని అనుకుంట. ట్రాఫిక్ జరసేపు ఆగితే ఆగింది గాని........ పేపర్లగిన వస్తే మన రాష్ట్రమంత ఎరికైతది.

ఆంజనేయులు అంటే ఏంటి ? మనం గిన ధర్న జేసిన మని చంకలు గుద్దుకుంటున్నావ్ – అరె సుర్మ గా ! గందుకే ఈ దినాం న్యూస్ పేపర్లు చదువుండి రా అని నేను జెప్త ! చెత్త మీద.....

కిట్టన్న చెత్తకు ఎతిరేకంగా

ఆంజనేయులు బెంగుళూరుల సుత గిదే పోరాటం నడుస్తున్నది. బెంగుళూరు అందమైన నగరం. అందరు దాన్ని గార్డెన్ సిటీ అంటారు. అక్కడున్నన్ని పార్కులు మన ఇండియాల ఎక్కడ లేవు. పెద్ద పెద్ద భవనాలు ఆకాశాన్ని అంటుతయి. గా ఎపార్ట్ మెంట్ల ల్ల బతికేటోళ్ళు ఈ నడుమ వీధుల్లోకి వచ్చిండ్రు. సిటీల చెత్తను యిష్టం వచ్చినట్లు ఖాళీ స్థలాల్ల నింపుతున్నారని గొడవ జేసిన్రు.

కిట్టన్న అర్రె.....నేను టివి ల జూసిన. ఏదో పెద్ద చెరువు గురించి లొల్లి అయింది.

ఆంజనేయులు బెల్లాందుర్ కొలను గురించి అయిన గొడవ నువ్వు జూసి వుంటవు. మన దేశంల జాతీయ హరిత వివాద విచారణ కేంద్రం వున్నది. ఇంగ్లీషు ల National Green ట్రిబ్యునల్ అంటారు. నగర పాలక సంఘం మీద బెంగుళూరులో విరుచుక పడింది. బెల్లాందుర్ పెద్ద అందమైన సరస్సు దగ్గర చెత్త జమ చేస్తుంటే ఆ సరస్సు క్రమంగా ఎండి పోతన్నది. పైగా ఆ సరస్సు చుట్టూత సానా ఫ్యాక్టరీలు వున్నాయి. అవి వదిలే వ్యర్థాలన్నీ సరస్సులోకి వస్తున్నాయి. దాంతో కర్నాటక రాష్ట్ర కాలుష్య నియంత్రణ ప్రభుత్వ శాఖ బెల్లాందూర్ చుట్టూత వున్నా తొంబై ఏడు ఫ్యాక్టరీలను

| | |
|---|---|
| | మూసివేయమని నోటీసులు యిచ్చింది. |
| సుర్మ | అబ్బో.....ఒక్కసారే తొంబై ఏడు ఫ్యాక్టరీలను మూసేయ్యమన్నదిలే........చాలా పెద్ద షాకిచ్చిందన్న మాట. మరి మూసింగ్రా |
| ఆంజనేయులు | కొట్లాట నడుస్తున్నది. |
| కిట్టన్న | అయితే.....ఈ బాధలు పళ్ళేక కొట్లాడేది మనం ఒక్కళ్ళమే కాదన్న మాట. |
| ఆంజనేయులు | ఖచ్చింతంగా కాదు. |
| కిట్టన్న | మరి చెత్త ఆడ జమచేసుడు బంద్జైనదా ? |
| సుర్మ | నగర పాలక సంస్థ కోర్టు మాట యింటది కద |
| ఆంజనేయులు | చెత్త జమ అయ్యే ప్రాంతాలు ఆ ప్రాంతంలో నివశించే మనుషుల ఆరోగ్యాలకు ప్రమాదకరంగ మారుతున్నయి. తూర్పు ముంబాయి లో దేవనార్ ప్రాంతం ల 326 ఎకరాల్ల చెత్త నిండింది. అక్కడ చెత్త గుట్టలుగా పేర్క పోయి ఒక్కొక్క గుట్ట 30 మీటర్ల ఎత్తు దాక పోయింది. అంటే కనీసం ఒక గుట్ట గోమ్మిది అంతస్థుల బిల్డింగ్ అంట వుంటది. |
| సుర్మ | వామ్మో..... |
| ఆంజనేయులు | ముంబాయిల ఎల్లినంత చెత్త మరే నగరం ల ఎల్లదు కావచ్చు, ముంబాయిల మూడు చెత్త జమ అయ్యే ప్రాంతాలున్నాయి. మొత్తం నగరంల రోజుకి 5,500 మెట్రిక్ టన్నుల చెత్త జమ అయితది. |
| సుర్మ | అమ్మర బిడ్డో....మనోళ్ళు గింత చెత్త జమ చేస్తరా ? మరి దీని మూలంగ ఏం నష్టాలు లేవా ? |
| ఆంజనేయులు | ఎందుకు లేవు ? 2016 సంవత్సరంలో పొరబాటున దేవనార్ ప్రాంతం ల అగ్గి రాజు కుంటే అక్కడ నుండి విష పూరిత మైన పొగలు నగరంల వ్యాపించినయి. కొన్ని రోజుల దాక మనుషులు ఆ ప్రాంతాల నుండి పరుగులు దీసింగ్రు. అక్కడ జీవనం స్థంభించి పోయింది ఎరికేనా ? |
| సుర్మ | నీ.....యింటెనే బయం కాబట్టె |
| ఆంజనేయులు | బృహన్ముంబయి మున్సిపల్ కార్పోరేషన్ తాను నడిపే 74 మున్సిపల్ స్కూళ్ళ ను మూసి వేసింది. అక్కడి నుండి పొగ మొత్తం ప్రాంతాన్నంత కమ్మితే అమెరికా వాళ్ళ నాసా ప్రయోగించిన కృత్రిమ ఉపగ్రహం ఆ ఫోటోలు తీసింది. అక్కడున్న జనాలకు శ్వాస కోశ సంబంధమైన |

రోగాలొచ్చినయి. శానా మంది యిళ్ళు ఖాళీ చేసి కొంత కాలం దూరం  దూరం పోయింన్రు.

కిట్టన్న — అంజన్నా....మొత్తం దునియాల యిట్ల భూములను చెత్తతో నింపే దేశం మనదొక్కటే లెక్క గొడ్తంది.

ఆంజనేయులు — కాదు.....కాదు....అభివృద్ధి చెందుతున్న దేశాలన్నింటిల ఈ సమస్య వున్నది చెత్త నింపిన భూముల నుండి విడుదల అయ్యే హానికారక విషవాయువులు, ఆ చుట్టు పక్కల జలాశయాలు, బావులు కలుషితమైన నీటితో నిండి వుంటున్నయి.

సుర్మ — అయితే ఈ కష్టం  మన మొక్కల్లమే పడ్త లే మన్న మాట.

కిట్టన్న — ధూ.... గీ మాట యినంగనే నీకు సమ్మ గున్నాదిరా ? ఎదవన్నర ఎదవ....

ఆంజనేయులు — వాడ్ని  తిట్టకు కిట్టిగా ! మన మెందుకు కొట్లాడుతున్నామో.....డానికి మున్సి పాల్టోళ్ళు ఏం జెప్తరో సూద్దం. అయితే చెత్త  జమ అయితే యింకా కష్టాలున్నయి. మన చుట్టూత వున్నా వేడి అంటే ఉష్ణోగ్రత పెరుగుతది. 2008 లో  అమెరికాలో లెక్కలు ఎసింన్రు. 30 కోట్ల మెట్రిక్ టన్నుల మీథేన్ విషవాయువుని వాళ్ళ దేశం ల చెత్త విడుదల చేసిందట. మీథేన్ ఒక హరిత గృహ వాయువు. అంటే అది భూతాపాన్ని  విపరీతంగ పెంచుతుంది.

కిట్టన్న — నిజమే అంజన్నా....కాని ఎవ్వరు నీ మాట యింటం లేదు గద. మన కాలనీల సుత ఎదో కొద్ది మంది తప్ప అందరు పట్టించు కుంటున్నరా ?

సుర్మ — నువ్వు చెప్పేది నిజమేనే. కాని మరి ఈ చెట్టంత మున్సిపాల్టోళ్ళు ఎక్కడ ఎస్తరంటవు ?

కిట్టన్న — దాంతో మనకేం సంబంధం ? మన చుట్టు ఈ చెత్త జమ చేసేటందుకు మనం ఒప్పుకోం.

ఆంజనేయులు — అరే........గట్ల కోపగించుకోకు కిట్టన్న. మన సుర్మ ఒక ప్రశ్న ఏసిండు. మంచి ప్రశ్న ....దాని మీద మనకు కోపమెందుకు.

కిట్టన్న — అరే.....గా ప్రశ్నలన్నింటికి మనం జవాబు చెప్తమా ? ఈ నగరాన్ని మనం నడుపుతున్నమా ? ఈ నగరానికేమైంది ? అని మనం ప్రశ్న ఏస్తే జవాబు చెప్పాల్సింది మన నాయకులు, మున్సిపల్ అధికారులు మనం కాదు.

ఆంజనేయులు నిజం చెప్పాలంటే....సమస్యకు జవాబు మనం చెప్పగలిగితే అది గొప్ప జవాబు అయి వుంటది. ఎందుకంటే మనం మనందరి గురించి ఆలోచిస్తున్నం. ఏ మంటవ్ ?

కిట్టన్న నిజం గావచ్చు. కాని నా మట్టి బుర్రకు జవాబు దొరకదు. ఎన్నిసార్లు నేను సిటీల తిరిగినప్పుడు చూసిన. రోజు రోజుకి చెత్త జమ అవుతున్న జాగాలు పెరిగిపోతున్నయి. శాన తొందరగ పెరుగుతున్నయి.

సుర్మ నిజం కిట్టన్న – మన చుట్టూ సుత షాపులున్నయి. చాలా చిన్న చిన్న షాపులు – అయిన సుత రోడ్ల మీద చెత్త కనపడుతున్నది. ఔనా, కాదా ?

కిట్టన్న నువ్వు చెప్పేది నిజం. మనం యిక్కడ్నే ఫెయిలవుతున్నం. అసలు చెత్త లేకుండ మనం చెయ్యలేం. కనీసం తక్కువలో తక్కువ చెత్త మనిండ్లల్ల ఎల్లేట్టు జెయ్య లేక పోతున్నం. జనం పెరుగుతున్నరు. కాని డానికి రెండు రెట్లు చెత్త పెరుగుతున్నది.

సుర్మ గదే మరి........యింక చెత్త పడేసందుకు వేర్వేరు జాగాలు ఎతుక్కోవాల్నా ?

ఆంజనేయులు మా ఫ్రెండొకర్ని రేపు మనందరితో మాట్లాడెటందుకు రమ్మని పిలచిన ఆయన ఈ చెత్తను ఏం జెయ్యాలె....ఎట్లా జెయ్యాల్ లో అనుభవమున్నోడు. ఆయనైతే నాతో ఏమన్నడంటే మూడు జాగ్రత్తలు తీసుకోవాలన్నడు. ఒక్కటి చెత్త తక్కువ వచ్చేట్లు చూస్కోవాలి. అంటే యింగ్లీషు ల reduce అన్నడు. తర్వాత చెత్తను యితరత్రా ఉపయోగించుకునే దారులు వెతకాల అన్నడు. అంటే Reuse. చెత్తను ఏర్దైనా పద్ధతులలో మరో ఉపయోగపడే వస్తువుగా మార్చుకోవాలి అన్నడు. అంటే Recycle. గిట్ల మూడు 'R' లు చెప్పిండు. రేపు మనం మన కాలనీ వాళ్ళతో మీటింగు పెట్టుకుందం. ఆయన మాట్లాడ్తడు.

సుర్మ మంచి ఆలోచన జేసినవు అంజన్నా......

(interlude)

ఆంజనేయులు రండి, రండి మెహసిన్ గారూ ! మా వాళ్ళకు కాస్త ఈ చెత్తను ఎట్ల నిగ్గాల్నో జర చెప్పండ్రి .

మెహసిన్ నిగ్గడమా ?

ఆంజనేయులు అదే నండి. ఎట్లా మేనేజ్ చెయ్యాల్నో జెప్పండ్రి.

మధుర అయ్యా ! అసలే మా కాలనీ చుట్టూత ఖాళీ స్థలాల్ల మున్సిపాల్టోళ్ళు చెత్త తెచ్చి నింపుతున్నరు. మాకు లేని పోని రోగాలొస్తున్నయ్. పరేశాన్ అవుతున్నం. మాకు మేముగా ఏం జెయ్యగలమో చెప్పండ్రి.

మెహసిన్ చెత్తను ఎరువుగా మార్చే విధానాలున్నాయి.

జాన్ గదే కొన్నేళ్ళ ముంగట అంబర్ పేటల ఆ ఏర్పాటుండెడిదని మా కిట్టన్న జెప్పిండు. గిప్పుడు ఆ ఏర్పాటు లేదు గద.

మెహసిన్ ఔను. నేను విన్నాను. కాని అప్పటి చెత్తకీ, యిప్పటి చెత్తకీ చాలా మార్పు వచ్చింది. చెత్తలో ప్లాస్టిక్ పెరిగింది. నిజానికి ముందు మనం క్యారీ బ్యాగులు వాడటం మానెయ్యాలి. అట్లనే ఎలక్ట్రానిక్ వస్తువులు. అదే మొబైళ్ళు, కంప్యూటర్లు పాతవైన కొద్దీ వాటిని చెత్త కింద పారేస్తున్నారు. వీటిని జాగ్రత్తగా వాడాలి. కొత్త మొబైల్ మోడల్ వచ్చిందంటే యువతీయువకులు పాతవి పారేసి కొత్తవి కొంటున్నారు. దానితో ఎలక్ట్రానిక్ చెత్త పెరుగుతున్నది. ముందు మనం చెత్తను తగ్గించుకునే ప్రయత్నం చెయ్యాలి.

జాన్ మధురా ! వింటున్నావా ? మీ ఆడోళ్ళు ఎక్కువ చెత్త జమ చేస్తరు.

మధుర అ అ అ.....మీరు చెత్త జమ చెయ్యటంలో ముందుంటారు. జాన్ ! కొత్త కొత్త సెల్ ఫోన్లు కావాలని – ఫ్లాట్ కంప్యూటర్ మానిటర్లు కావాలని కళలు కనేది మీరే.

కిట్టన్న ( దగ్గి ) మనం ముందు మన దగ్గరలో ఖాళీ స్థలాలలో వున్నా చెత్త గురించి మాట్లాడదామా ?

మెహసిన్ వానా కాలంలో చెత్త నుండి శీధిరం చెయ్యడానికి అమెరికా ఒక పద్ధతిని పాటిస్తుంది.

సుర్మ ఏం పద్ధతి అది ?

మెహసిన్ యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా Environmental Protection Agency ( EPA ) రూపొందించిన పద్ధతి ద్రావణీయ మాన్య

వడబోత పద్ధతి. దాన్ని ఆంగ్లం లో Leachate System అంటారు. నిజానికి Leachate అంటే శిధిల మవుతున్న చెత్త నుండి లోపలకు యింకిన వాన నీరు. వాన నీరు చెత్త నుండి లోపలకు యింకేతప్పుడు చేత్తలోని అనేక కార్బనిక పదార్థాలు ఆ వాన నీటిలో కరుగుతాయి. చెత్త ఒక వైపు పల్లంగా వున్నా ప్రదేశంలో ఒక అధిక సాంద్రతర పోలీఎథిలీన్ పైపుని అమరుస్తారు. దాన్నే High Density Poly Ethglene HDPE పైపు అంటారు. సగం భూమిలో కూరి వున్న ఈ పంపు ద్వారా కార్బనిక ద్రావణీయ వాన నీటిని సేకరించి సుద్ధి చేస్తారు. అప్పుడు మిగత మాలిన్యాలు మొక్కలకు ఎరువుగా ఉపయోగ పడ్తాయి.

మధుర వామ్మో ! ఇందంత పెద్ద పద్ధతి లెక్క వున్నది. దీనికి పైసలు మస్తు కర్చయితయి.

మెహసిన్ నిజమే...మన ఆరోగ్యం కోసం మనం కొంత ఖర్చు పెట్టుకున్తానికి సిద్ధ పడాలి. అంతేకాకుండా ఈ చెత్త నుండి మీథేన్ వాయువు విడుదల అవుతుంది. చెత్త శిధిల మవుతున్నకొద్దీ విడుదలయ్యే ఈ వాయువుని విద్యుత్తు తయారు చేయడానికి ఉపయోగిస్తారు. అమెరికాలోని కాలిఫోర్నియా రాష్టంలోని యోలో కౌంటీ లో యిలాగే చెత్త నిలువ చేసిన ప్రాంతంలో 14 లక్షల ఘనపు టడుగుల మిథేన్ గ్యాస్ ప్రతి రోజులా ఉత్పత్తి అవుతుంది. దీన్ని విద్యుత్తు ఉత్పత్తి చేయడానికి ఉపయోగిస్తారు. మనం కూడా ఇండియాలో ఈ పద్ధతి పాటించడానికి అవకాశాలు ఉన్నాయి.

సుర్మ చెత్త దగ్గర సుత ఏదైన మైనింగ్ చేస్తరా ?

మెహసిన్ ఔను, దీన్ని లాంగ్ ఫిల్ మైనింగ్ అంటారు. చెత్తలో ఎప్పుడూ 65% మట్టి వుంటుంది. అది కాకుండా మిగతా భాగంలో రాళ్ళు, లోహాలు, చెక్క, అల్యూమినియం, గాజు, ప్లాస్టిక్, పోలీస్టైరిన్ లాంటి పదార్థాలు స్వల్ప శాతాల్లో వుంటాయి. వాటన్నింటిని తవ్వి తీసి మట్టిని, ఇతర పదార్థాలను వేరు చేసి అక్కడి నుండి తరలిస్తారు.

కిట్టన్న మరి అప్పుడప్పుడు ఈడ చెత్త తగల బెడ్తరు గడ.

మెహసిన్ ఔను. కొన్ని సార్లు చెత్తను భాషమీ పటలం చేస్తారు. దీన్ని

ఆంగ్లంలో Incineration అంటారు. కాని దానితో వచ్చే సమస్యలు కొన్ని వున్నాయి. హాని కారక పొగలు వెలువడటం యిందులో ప్రధాన సమస్య. ఈ పద్ధతిని కేవలం కొన్ని నిర్దిష్ట ప్రాంతాల్లో మాత్రమె ఉపయోగించాలి.

మధుర	తగల బెడితే గా పొగ భరించలేక మేము శాన సార్లు ఒక్కిరి బిక్కిరి అయినం.

మొహసిన్	నిజానికి ఈ పద్ధతి అన్ని చోట్ల  ఉపయోగించారని మీకు చెప్పాను. ఈ పద్ధతి ఒక శక్తి వనరు. భస్మీకరణం చెయ్యడం వలన శక్తి ఉత్పత్తి అవుతుంది. ఈ శక్తిని ఉపయోగించుకునే పరిస్థితుల్లోనే భస్మీ పటలం చేస్తారు. శక్తిని ఉపయోగించుకునే యితర పద్ధతు లేమిటంటే గ్యాస్ తయారు చేయడం, చెత్తను వాయురహితంగా శిధిలం చేయడం, ఉష్ణ జనిత వియోగం చెందించడం వీటన్నింటి ద్వారా శక్తిని ఉత్పత్తి చేయవచ్చు. నిజం చెప్పాలంటే భస్మీకరణం చేసేటప్పుడు తప్పని సరిగా చేత్తలోని వివిధ పదార్థాలను వేర్వేరు చెయ్యాలి. అలా చెయ్యక పోతే అప్పుడు వెల్వడే పొగల్లో చుట్టు పక్కల వున్నా వారి ఆరోగ్యం దెబ్బతింటుంది. పర్యావరణం కలుషితమవుతుంది. పైగా వివిధ పదార్థాలను వేరు చెయ్యకపోతే అక్కడ విద్యుత్తు కూడా ఉత్పత్తి కాదు.

ఆంజనేయులు	చూడబోతుంటే మా దగ్గర ఈ పద్ధతి పాటించిండ్రో లేదో అని అనుమానం వస్తోంది.

మొహసిన్	ఈ తగల బెట్టడం వలన చెత్త  95% నుండి 96% వరకే కాలుతుంది. మిగిలిన బూడిదను అక్కడి నుండి తొలగించరు. కాని వెంటనే దాని మీద మళ్ళీ  కొత్తగా చెత్త వేస్తారు. లేకపోతె బూడిద దూరానికి విస్తరిస్తుంది.

మధుర	అంటే మళ్ళీ చెత్త నింపడానికి అంతా తయారన్న మాట.

మొహసిన్	అయితే ఈ భస్మీకరణం చెత్తలో అధిక భాగం చెత్త హాస్పిటల్ నుండి వచ్చే చెత్త అక్కడ ఎక్కువగా ఉన్నప్పుడు మంచి ఫలితాలు యిస్తుంది. ఆ చెత్తలో మనకు వ్యాధులు వ్యాపించే కారకాలు ఉంటాయి. అవి తగల బడటం, అలాగే హానికారక పదార్థాలు నశించడం సంభవిస్తుంది. ఇటువంటి పద్ధతి జపాన్ దేశం ఎక్కువగా ఉపయోగిస్తుంది.

ఆంజనేయులు	ఎందుకని ?

| | |
|---|---|
| మొహసిన్ | ఎందుకంటే అక్కడ భూమి తక్కువ. అంతే కాకుండా ఈ పద్ధతిలో విడుదలయ్యే శక్తిని జపాన్ వినియోగించుకుంటుంది. ఈ పద్ధతిని డెన్మార్క్, స్వీడన్ దేశాలు కూడా పాటిస్తాయి. |
| సుర్మ | అయితే తగల బెట్టడం తప్పుకాక పోవచ్చు మొగని, చెత్త జమ చేసే ప్రాంతాలు మాత్రం తగ్గకుండ గట్లనే వుంటయి. |
| మధుర | ఔ సుర్మ ! కరెక్టు జెప్పినవ్. |

Interlude

| | |
|---|---|
| సుర్మ | మొహసిన్ సాబ్ వచ్చిండు పోయిండు. కాని మన చెత్త సమస్య గట్లనే వున్నది. |
| మధుర | మనం ఒక్క పాలి ధర్నా జేసినం. ఎవ్వరు పట్టించు కుంటలేదు. |
| కిట్టన్న | మల్ల మల్ల చెత్త నింపుతనే వున్నారు. |
| ఆంజనేయులు | చెత్త నింపే స్థలాలు మరీ విశాలంగా ఉండకుండా మున్సిపాల్టోళ్ళు జాగ్రత్తగ ఉండాలి. |
| కిట్టన్న | గోతులు తీసి చెత్త నింపితే బాగుంటది. |
| సుర్మ | అసలు గీ చెత్తను రాకెట్లతో వేరే గ్రహాలకు పంపితే బాగుంటది. |
| మధుర | బలె జెప్పినవ్ సుర్మా ! |
| ఆంజనేయులు | అంటే మస్తు కర్సు పెట్టి చెత్తను అంతరిక్షం లకి పంపాల్నంటవు. నీకు మరీ ఎకె సెక్కంగా వున్నది సుర్మ ! |
| కిట్టన్న | సర్లే. సినిమాల్ల హీరో డాన్సు వెయ్యటానికి తయారు కాంగనే ఎనక పది మంది ఎక్కడ్నుండో వచ్చి నిలబడి స్టెప్పులు ఏసినట్లు చెత్త సంగతి ఎత్తంగనే చెత్త ఐడియాలన్ని జమ అయితన్నయి గని మనం ఏం జేస్తే బాగుంటదో జెప్పుండ్రి. |
| సుర్మ | మొదటిది మనం చెత్తను ఎక్కువ తయారు కానివ్వ కూడదు. |
| మధుర | చెత్తను మల్ల మల్ల ఉపయోగించే అవకాశం వుందా ? |
| ఆంజనేయులు | ఎందుకు లేదు ? ఉదాహరణకు కాగితం. కాగితాన్ని పునరావర్తితం చేయడం వలన 27% మాత్రమె గాలి కాలుష్యం ఏర్పడుతుంది. అదే ముడి సరకులతో కాగితం తయారు చేయాలనుకుంటే గాలి కాలుష్యం 100% వుంటుంది. |
| కిట్టన్న | ఔనంట ! వాడిన ప్లాస్టిక్ సీసాను ఉపయోగించి మళ్ళీ కొత్త ప్లాస్టిక్ సీసా తయారు చేస్తే ఆ తయారీలో తక్కువ విద్యుత్ శక్తిని వాడ్తారు. అలా మిగిలిన విద్యుత్తు ఒక విద్యుద్దీపాన్ని మూడు గంటల పాటు ఎలిగిస్తదట |

| | |
|---|---|
| మధుర | భలే గున్నది ! |
| ఆంజనేయులు | అంతేకాదు, వాడిన గాజు సీసాలను మల్ల పునరా వర్తితం చేస్తే విద్యుత్తు ఆదా అవుతుంది. ఆ విద్యుత్తుతో 25 నిమిషాలు కంప్యూటర్ నడుస్తది. |
| సుర్మ | అరె గట్లయితే అన్నింటిని మల్ల...మల్ల...మల్ల...గదేంది పునర.... |
| ఆంజనేయులు | పునరావర్తితం......రీ సైక్లింగ్. |
| సుర్మ | ఆ అర్థదీ...రీ సైక్లింగ్ జేస్తే బాగుంటది కదా ! |
| మధుర | అంతకంటే తక్కువ కర్సుతో ఎల్లిపోయేది యింకో పద్ధతి వుంది. |
| కిట్టన్న | అంతకంటే తక్కువనా ? ఏందది. |
| మధుర | ఒక వైపు రాసిన కాగితం రెండో వైపు సుత వాదాల. ప్లాస్టిక్ సీసాను మల్ల మల్ల మనం వాడుకోవచ్చు. వాటిని శుభ్రం చేసుకుంటానికి అయ్యే కర్సు డబ్బు నీళ్ళే గడ. సీసాలను విభజించి, కరిగించి, సాంబాలల్ల  అదే అచ్చుల్లల్ల పోసి కొత్త సీసాలు తయారు చేసుడు కంటె చౌకనే గద. |
| సుర్మ | అరే.....అట్లా మనం జేస్తనే వుంటిమి. ఒక్క నీళ్ళ సీసా కొంటే పదిసార్లు నీళ్ళు నింపు కుంటున్నం. కొత్తగ ఏం జెప్పినవ్ ? |
| కిట్టన్న | అదేరా బై....కొంత మంది వుంటారు.  సర్కీ గాళ్ళు. అదే తిక్కలోళ్ళు. ఒక్కసారి వాడంగనే పారేసేటోళ్ళు......వాళ్ళకు సుత జెప్పు. |
| సుర్మ | అరే.....మమ్మల్ని జూసి ఆళ్ళు నేర్సుకోవాలె బై. మల్ల మల్ల జెప్పుడు వుండది. |
| ఆంజనేయులు | సర్సరే.....మున్సిపాల్టోళ్ళకు రేపు మనం చెత్త నింపే జాగల మీద ఒక వినతి పత్రం యిద్దం. మనందరం రేపు గాడికి పోయేటందుకు రెడీగ వుండుండ్రి. వస్తా ! |
| అందరు | మంచిదన్న ! |

***************